# రాయలేని కథ

"వాళ్ళ జీవితం అంతా పరిమళభరితం- మత్తెక్కించే సౌరభం- కళ్లను కైపెక్కించే బంతిపూల సౌందర్యం- జాజులు లిల్లీలు చుట్టూ వాడినా వీడని గుమాళింపుల దవనాలూ... మరువాలూ- వాళ్ళు పువ్వులు పరిచిన సింహాసనం మధ్యన కూచుంటారు- కల్యాణ మండపంలా అలంకరించిన పూలపందిట్లో రోజూ 10-12 గంటలు కూచునే అదృష్టవంతులు- వాళ్లు- ఎప్పుడూ పెళ్లికూతుళ్లు- పెళ్లినాటి రాత్రి పందిరి మంచానికి చేసిన సింగారాల మధ్యలో కూచున్న కన్నె బంగారాలు.. ఊహల మాలలు అల్లుకుని..."

సుశీల కథ రాయటం మొదలెట్టింది. పువ్వుల దుకాణం వర్ణన తిలక్ వచన కవిత్వం అంత హృద్యంగా అందంగా నడుస్తోందని మురిసిపోతోంది.

అంతలో... కాలింగ్ బెల్లు మోగింది- కవిత్వ లోకాల్నుంచి ఉలిక్కిపడి... వాస్తవానికొచ్చేప్పటికి మళ్ళీ బెల్లు మోగింది.

అయినా రాసిన పేరా మళ్లీ చదువుకుని మురిసిపోతోంది.

సుశీలలో ఆనందం తాండవిస్తోంది.

వెళ్ళి తలుపు తెరిచింది మూడో బెల్లు మోతకి.

రజని 'హాయ్' అంటూ తోసుకొచ్చింది– "క్యా డార్లింగ్.. క్యా కర్తేహై, ఐదుసార్లు టింగ్ కొట్టాను"

"కథ రాస్తున్నానే"

"ఓ... అయితే డిస్టర్బ్– చేసినట్లున్నాను– త్వరగా కాఫీ ఇచ్చి గెటౌట్ చెప్పెయ్"

"బలే దానివే– నువ్ వస్తే నాకు ఎంత ఎడ్యుకేషనో తెలుసా? నేను ఇంట్లో కూచుని ఊహాలోకాల్లోంచి కాయితం మీద కథలల్లుతాను.. నువ్ వాస్తవాన్ని భవిష్యత్తుతో కలగలిపి రోడ్లమీద కథల్ని వార్తలు చేస్తావు– నీలాంటి వాళ్లతో చర్చిస్తే నా కథకి సామాజిక స్పృహ, సార్థకతా వస్తుంది" అంది సుశీల.

"సామాజిక స్పృహ అనేమాట సిన్సియర్‌గా అన్నావో– సెటైరికల్‌గా అన్నావో నాకు తెలీదు గాని.. రచన చేసేవాళ్లే సమాజం గురించి కాస్త ఆలోచించాలి– ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సినిమా మీడియా ఏదైనా కావచ్చు కేవలం వినోదపరిచేలా..."

"రజనీ కాస్త ఆగుతావా...." కట్ చేస్తూ అంది సుశీల.

"నేను కాలక్షేపానికి కథలు రాసే రచయిత్రిని"

"నేను వప్పుకోను– వప్పుకోను అంటే... ఆ రచనలని వప్పుకోనూ అనే కాదు. నువ్వా పని చేయడాన్ని వప్పుకోను. ఔను సుశీలా అక్షరం ఏది రాసినా 'అక్షర'మై వుంటుంది. అది శాశ్వతంగా నిలుస్తుంది. శాశ్వతంగా నిలిచేదాన్నే అక్షరం అంటారు– నువ్ రాసే కాలక్షేపం కథల్లో అక్షరాలు లేవా? అవి శాశ్వతంగా నిలుస్తాయని కాంక్షలేదా? భయంలేదా??"

సుశీల మౌనం–

రజనీకి మొహమాటం వేసింది– అతిగా వాగానేమోనని సిగ్గేసింది–

"కాఫీ పెట్టమన్నాను కదా- సామాజిక స్పృహ వుండటం అంటే ఇదేనే- ఇంతకన్నా అర్థంకాని లాటిన్ ఏమీలేదు" నవ్వుతూ అంది.

సుశీల కూడా శృతి కలిపి నవ్వింది!

"రజనీ కాఫీ అందుకుంటూ ఇంతకీ ఏం కథ రాస్తున్నావు డార్లింగ్"

"సోకాల్డ్... సామాజిక స్పృహ లేని కథలే" నిర్లిప్తంగా... కాదు నిర్లక్ష్యంగా అంది సుశీల.

"వొద్దు- ఓవరేక్షన్ వద్దు- చెప్పవే రాస్కెల్!" అనునయిస్తూ అంది రజని.

సుశీలలో కవయిత్రి ఇంకు విదిపిన పెన్నులా పునరోత్సాహాన్ని సంతరించుకుంది-

"పూల అంగడిమీద కథే- పాయింటేమిటంటే.. అంగడిలో మాలలల్లినవాళ్లు అది దేవుడికీ- మంత్రులకీ, మహానటులకీ, దేవుళ్లకీ, ఎప్పుడో చనిపోయిన పుణ్యాత్ములకీ చేరతాయని మహదానందంతో మాలలల్లటం- లాభాలు రావటం-తృప్తిగా మళ్లీ పూలు కొనడానికి వెళ్లటం-

ఇదీ కాన్సెప్ట్- ఓపెనింగ్ పేరా ఎక్సలెంట్‌గా వచ్చింది- దేవరకొండ బాలగంగాధర తిలక్ ఆవహించినట్లు రాసేశాను. ఒక్కక్షణం అంటూ.." తను రాసిన పేరా తెచ్చి చూపింది-

రజనీ ప్రతీ అక్షరం చదివి మెచ్చుకుని "నీ కథనం బావుందే- కానీ కథ.. అదే.. కాన్సెప్ట్ నాకు నచ్చలేదు- నిర్మొహమాటంగా చెప్తున్నాను.. ఏమీ అనుకోకు!" మొహమాటపడుతూ అంది రజని-

సుశీల నిజంగానే హర్టయింది- "సామాజిక స్పృహ లేదనేనా నీ ఏడుపు"

"కరెక్ట్- కానీ నేను ఏడువకూడదు- నువ్వు ఏడవాలి-"

సుశీల కళ్లు ఎర్రపడి పెద్దగా అయ్యాయి.

రజనీ ఆ చూపుల్ని ఊహించే తప్పించుకుంది– "సుశీలా ఆ పూల దుకాణంలో పూలమ్మే ముసలమ్మ కథ చెప్తా... వింటే విను.. నచ్చితే రాసుకో– రాయకపోయినా అర్థం చేసుకో చాలు–"

సుశీల వింది– ఆ తర్వాత తను రాస్తున్న కథకి కొత్త సొబగులు అద్దింది–

✦ ✦ ✦

పొద్దున్నే పూల బుట్టల్ని రిక్షాలో వేసుకొచ్చిన యాదమ్మ తన దుకాణం లాంటి పేవ్‌మెంట్ మీద వెదురుబద్దల కాళ్లబల్ల వేసుకుని దుకాణం అంతా అమర్చింది. వాళ్ల జీవితం అంతా పరిమళభరితం అన్న తిలక్ కవిత్వం లాంటి... పువ్వుల్లో ముల్లులాంటి గునపం ఉందని ఆమెకి తెలియదు. మామూలుగా మాలలు రడీ అవుతున్నాయి. అదృష్టవశాత్తూ ఆరోజు ఏ రాజకీయ నాయకుడో నేలరాలిపోయాడు... అదృష్టం ఎవరిది.. రాష్ట్ర ప్రజలదా.. పూలమ్మి యాదమ్మదా? వదిలేద్దాం– జనం తండోపతండాలుగా ఆ మహానాయకునికి శ్రద్ధాంజలి ఘటించడానికి వస్తారని యాదమ్మకి తను తెచ్చుకున్న బేట్రీ రేడియో శుభవార్తనందించింది.

మహోత్సాహంతో మాలలల్లింది– ఆ మహానాయకుడి భౌతిక కాయానికి ప్రముఖులు అందరూ పుష్పాంజలి ఘటిస్తారు– అనే వార్త వినపడుతుండగా.. ఆ ఆనందం పొంగిపోయింది. కేంద్ర మంత్రులూ– ఎమ్పీలు– విమానం ఎక్కి ఇటేపే దిగి వస్తున్నార్ట– పేవ్‌మెంట్ల మీద దుకాణాలు ఉండరాదు– అందర్నీ నూటిపోటి బూతుల్తోనో.. లాఠీపోటుజులుంతోనో గెంటేస్తున్నారు. యాదమ్మ దుకాణం ముడిచే సమయం కూడా ఇవ్వలేదు. పూలన్నీ నలిగిపోయాయి పోలీసుల బూట్ల కాళ్ల క్రింద–

మిగిలిన దండలు రేపటికి అమ్ముకోడానికి లేదు అలాగే... మిగిలిన పువ్వులు రేపటికి వాడిపోతాయి-

ఆరోజు పెట్టుబడంతా బండలైంది... రేపటికి పెట్టుబడి ఇవ్వాల్టి రాబడే కదా!

యాదమ్మ దుఃఖం వినేవాడెవడు-

✦ ✦ ✦

దీనిమీద కథ రాయలేకపోతోంది- సుశీల- అయినా రాసింది. కళ్లలో నీళ్లు కలంలో సిరాగా జారిందేమో... అనిపించేలా రాసింది.

✦ ✦ ✦

కథ రిజెక్టయి పోస్టులో తిరిగొచ్చింది.

"ప్రోగ్రసివ్ థాట్‌లో కావల్సిన కమిట్‌మెంట్‌లేని కారణంగా మీ కథని మా పత్రికలో ప్రచురింట్లేదు- క్షమించండి" అని ఎడిటర్ లెటర్తో-

ఏది ప్రోగ్రెసివ్... ఎంత కమిట్‌మెంట్ ఉండాలో... తెలియక సుశీల మధనపడుతోంది.

ఇంతలో రజని కాలింగ్ బెల్ మోగించి.. ఇంట్లోకి వచ్చింది-

'మళ్లీ ఏం చెప్తుందిరా దేవుడా' అనుకున్న సుశీల రిజెక్టై వచ్చిన తన కథని రజని చేతుల్లో పెట్టింది-

"నీ కథ నచ్చకపోయినా పత్రికవాళ్లు రిజెక్ట్ చేసినా పర్వాలేదు- నీ కథ బావుంది" అని రజని చెప్పింది "మళ్లీ మళ్లీ ఇలాంటి కథే రాయి" అంది.

సుశీల యాదమ్మ కథని మళ్లీ రాయడానికి ప్రయత్నిస్తోంది.

